ఇలవేల్పులకు నీరాజనాలు



నూకాలమ్మకు పూజలు నిర్వహించిన భక్తులు



ముత్యాలమ్మను దర్శించుకున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో గంగానమ్మ

జంగారెడ్డిగూడెం : తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణ ఇలవేల్పు నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ పిల్లా పాపలతో బారులు తీరి అమ్మను దర్శించి ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. ఆలయకమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు) నేతృత్వంలోని ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనూకాంబికా మహిళా భక్త సేవా సంఘ సభ్యులు, యువత భక్తులకు సేవలు అందించారు. ఆలయ కళ్యాణకళావేదిక వద్ద జ్యోతిష్య పండితులు భమిడిపాటి వెంకట లక్ష్మీ నారాయణశర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ఆయనకు అమ్మవారి శేషవస్త్రాలు, జ్ఞాపికను అందించి సత్కరించారు. సాయంత్రం కొయ్యలగూడెం ట్రాక్ ఆర్కెస్ట్రా వారిచే ఆవుల రాంబాబు నిర్వహణలో సినీ భక్తిరంజని నిర్వహించారు. జాతరలో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం 7 గంటలకు శివపార్వతుల కల్యాణం అనంతరం శ్రీఅభయాంజనేయ భజన మండలి వారిచే కోలాటం భజన నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు) తెలిపారు.

ముత్యాలమ్మకు పూజలు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారి తృతీయ వార్షికోత్సవంలో భాగంగా చివరిరోజు బుధవారం ఆలయంలో ప్రధానార్చకులు కాజా ఫణికుమార్ శర్మ, బొడ్డు సత్యనారాయణగుప్త పూజలు నిర్వహించి, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మ కుమారి, ఆలయకమిటీ నిర్వహణలో భక్తులకు భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం శ్రీదాస సాహితీ వసుంధర భజన మండలి వారిచే కోలాట నృత్యప్రదర్శన నిర్వహించారు.

గంగానమ్మ.. శుభములు కలిగించమ్మా

జంగారెడ్డిగూడెం : శోభాకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలకరించారు. ఆలయ అర్చకులు పెద్దింటి నరసింహాచార్యులు, వాడపల్లి శేషాచార్యులు గంగానమ్మకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఉదయం నుంచే భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మహాలక్ష్మీ అమ్మవారి ఊరేగింపు

జంగారెడ్డిగూడెం రూరల్ : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని లక్కవరంలో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అశ్వ వాహనంపై అమ్మవారి ఊరేగింపు నేత్రపర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలను పంపిణీ చేశారు.

కొయ్యలగూడెంలో ఉగాది వేడుకలు

కొయ్యలగూడెం : శోభాకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడి ప్రసాద వితరణ చేశారు. ప్రధానంగా గ్రామ దేవతల ఆలయాలు మహిళా భక్తులతో కళకళలాడాయి. అంకాలగుడెం గ్రామంలోని శ్రీగంగానమ్మ, కులదేవత శ్రీ విధమ్మ ఆలయాల వద్ద విగ్రహాలకి నైవేద్యాలను రజక మహిళలు సమర్పించారు. కొయ్యలగూడెం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో సాయంత్రం బ్రహ్మశ్రీ అనిపెద్ది వేంకట నరసింహ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు.

కొండదేవతలకు పూజలు

బుట్టాయగూడెం : పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన పల్లెల్లో బుధవారం ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. గిరిజన గూడెంలో కొండదేవతలకు పూజలు చేశారు. గంగానమ్మ, గుబ్బల మంగమ్మ, ముత్యాలమ్మ, నాగులమ్మ, కనకదుర్గమ్మ, పోచమ్మ తల్లి తదితర దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. ముఖ్యంగా ముప్పినవారిగూడెం సమీపంలో ఉన్న కడియలమ్మ అమ్మవారి గుడి వద్ద ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సీతప్పగూడెంలోని కణితి కుటుంబానికి చెందిన వారు అమ్మవారికి చీర, సారె తీసుకువచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాసియ్యపాలెంలో సమ్మక్క, సారక్క అమ్మవార్లకు పూజలు చేశారు. సోదెం అనే ఇంటి పేరుకు చెందిన వారంతా అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించగా తెల్లం వారు వియ్యంకులుగా నిర్వహించారు. బుట్టాయగూడెం గంగానమ్మ అమ్మవారిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. నల్లజర్లకు చెందిన కళాకారులు రకరకాల వేషధారణలు చేసి డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు.

విజయదుర్గమ్మకు వెండి కిరీటం సమర్పణ

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీ విజయదుర్గ అమ్మవారికి దేవక రామకృష్ణ దంపతులు 1.5 కేజీల వెండి కిరీటం అందజేశారు. వెండికిరీటంతో పాటు 65 రకాల మధుర పదార్థాలు, పట్టువస్త్రాలు, మంగళద్రవ్యాలను దాతలు ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో అందజేశారు. తొలుత దాత రామకృష్ణ కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.రామ్మోహన రావు, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సభ్యులు, మహిళలు ఆలయ మర్యాదలతో మేళతాళాలతో ఆహ్వానించారు. అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం వీరిని అమ్మవారి శేషవస్త్రంతో ఆలయ కమిటీ సత్కరించింది. భక్తులకు 25 కేజీల పులిహోర ప్రసాదాన్ని వాసవీ క్లబ్ గోల్డ్ సభ్యులు పంపిణీ చేశారు.



అంకాలగూడెంలో గంగానమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు



బుట్టాయగూడెంలో గంగానమ్మ ఊరేగింపులో విచిత్ర వేషధారణలు



అమ్మవారికి వెండి కిరీటాన్ని సమర్పించిన దేవక రామకృష్ణ దంపతులు

పారిజాతగిరిలో ఉగాది వేడుకలు



విశేష అలంకారణలో పారిజాతగిరి వెంకన్న

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ముఖ మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులచే శోభకృత్ నామ సంవత్సర పంచాంగ పఠన శ్రవణం చేశారు. అనంతరం పట్టణానికి చెందిన అన్నమాచార్య గాయని శ్రీమతి మంజరి గారిచే అన్నమాచార్య సంకీర్తన సంగీత విభావరి నిర్వహించారు. హరే శ్రీనివాస భజన మండలి చిన్నారులచే నిర్వహించిన కోలాట భజన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అన్న ప్రసాద వితరణ, ఉగాది పచ్చడి విశేష ప్రసాదము భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతిరాజు, సభ్యులు దండు ధనరాజు, వాసవి నగేష్, రెడ్డిరంగ ప్రసాద రావు, మాదల రామ్మోహనరావు, రవీంద్ర, ఆలయ పూర్వ ధర్మకర్త చైర్మన్ గంగాధర్, జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.

అన్నపూర్ణమ్మ.. ఆదుకోవమ్మా

టి.నరసాపురం : శోభాకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. టి.నరసాపురంలో కాశీ విశ్వేశ్వర స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద వేద పండితులు రంగనాథ శర్మ పంచాంగ శ్రవణాన్ని వినిపించారు.



ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర స్వామి

క్లుప్తంగా

శ్రీవారి సేవలో...



ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌కు స్వామివారి మెమెంటోను అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని నూతన ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ బుధవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్సీ వెంట బుసనబోయిన వంశీ తదితరులున్నారు.

శ్రీవారి పథకాలకు రూ.2 లక్షల విరాళం



దాతలకు విరాళం బాండ్ పత్రాలను అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి పథకాలకు ఒక భక్తుడు బుధవారం రూ.2,00,232 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన కొప్పిశెట్టి సుబ్బయ్య ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116, అలాగే గోసంరక్షణ పథకానికి రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాత దంపతులకు ఆలయ చైర్మన్ ఎస్వీ.సుధాకరరావు విరాళం బాండ్ పత్రాలను అందించి, అభినందించారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో దర్శనమిచ్చిన అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం రూరల్ : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గురవాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి క్షేత్రంలో స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశ్చిమ కనుమ ఎరుమేలి హరిత వాతావరణాన్ని తలపించేలా ఆలయ అంతర్భాగాన్ని కొబ్బరి చెట్లు, వివిధ వృక్షాలతో విశేషంగా అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు గూడూరు వెంకట శివ రామకృష్ణ అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, భస్మాభిషేకం, కనకాభిషేకం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి వెండి మకర తోరణం



స్వామికి సమర్పించిన వెండి మకర తోరణం

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని తాడేపల్లిగూడెం రోడ్డులో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి మకర తోరణం బుధవారం అలంకరించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఏటా ఉగాది వేడుకల నేపథ్యంలో స్వామివారికి విలువైన వస్తువు తయారు చేయించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ దఫా భక్తుల కానుకలతో సుమారు రూ.90 వేల విలువైన రజత మకర తోరణాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ తయారు చేయించింది. ఈ సందర్భంగా గర్భగుడిలో దేవేరులతో సహ కొలువైన స్వామివారికి మకర తోరణాన్ని అలంకరించి పూజలు చేశారు.

జావ చలివేంద్రం ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా స్థానిక సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మెయిన్ బజారులోని పయిడేటి రామారావు జ్యూయలరీ దుకాణం వద్ద ఏర్పాటు చేసిన రాగిజావ చలివేంద్రాన్ని నగర మేయర్ షేక్ నూర్జహాన్ బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజల, పాదచారుల దాహార్తిని తీర్చడానికి సత్యసాయి సేవా సంస్థలు చేస్తున్న సేవా కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీ కార్యక్రమంలో సైతం సత్యసాయి సేవా సంస్థల సహకారం ఉందని చెప్పారు. అవసరమైన వేళల్లో, ఆపద సమయాల్లో ప్రజలను ఆదుకోవడానికి సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ఎప్పుడూ ముందుండడం వారి సేవాతత్పరతకు నిదర్శనమన్నారు. వంకదారు ప్రవీణ్, పయిడేటి రామారావు, లక్కోజు రాజగోపాలా చారి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పత్రాల అందజేత



లబ్ధిదారులకు వైఎస్సార్ బీమా పత్రాల అందజేత

కొయ్యలగూడెం : వైఎస్సార్ బీమా పథకం ద్వారా ఎంపికైన రెండు కుటుంబాలకు లబ్ధి చేకూరినట్లు సర్పంచ్ తోటకూర పద్మావతి పేర్కొన్నారు. సచివాలయం కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రెండు కుటుంబాల వారికి అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సీతంపేట గ్రామానికి చెందిన అల్లం నాగేశ్వరరావు యాక్సిడెంట్‌లో చనిపోవడంతో అతనికి రూ.5 లక్షల బీమా వర్తించినట్లు తెలిపి దానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని భార్య పెద్ద సత్యవతికి అందజేశారు. అదేవిధంగా మారం చిన్న అనే వ్యక్తి చనిపోవడంతో అతని భార్య శిరీషకు రూ.లక్ష బీమా వర్తించిందన్నారు. క్లెయిమ్ చేసిన పదిహేను రోజులలో ఇరువురి మృతుల కుటుంబాలలోని భార్యల పేరిట బ్యాంకులలో జమ చేయడం జరిగిందని వెల్ఫేర్ అసిస్టెంట్ జి.లలిత భవాని పేర్కొన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు తోట జయబాబు, ఉపసర్పంచ్ మధ్యాహ్నపు అన్నపూర్ణ, తోటకూర శ్రీనివాసరావు, కొప్పుల వెంకటేశ్వరరావు, మధ్యాహ్నపు యేసు పాల్గొన్నారు.

కళాకారులకు ఉగాది పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న కృష్ణబాబు, దుర్గారావు, రాజ్‌కుమార్

జంగారెడ్డిగూడెం : వివిధ రంగాల్లో సేవలందించిన జంగారెడ్డిగూడెం ప్రాంతవాసులకు విజయవాడ విజయశ్రీ సాంస్కృతిక సేవ సంస్థ కళా తపస్వి, సినీ దర్శకులు, నటులు పద్మశ్రీ దాదాసాహెబ్ ఫాల్కె అవార్డు గ్రహీత కె.విశ్వనాథ్ గారి పేరిట ఉగాది పురస్కారాలు అందజేసింది. విజయవాడ గాంధీనగర్ కౌత పూర్ణనంద కళావేదిక వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. సినీ, నాటక రంగాల్లో సేవలందించిన అంబికా గ్రూప్ అఫ్ హోటల్ అధినేత ఉక్కుర్తి దుర్గారావుకు విశిష్ట సేవరత్న, నాటక రత్న ఉగాది పురస్కారం, ఇతర రాష్ట్రాల్లో సైతం తెలుగు జానపదాలను ప్రచారం చేస్తున్న కళాకారుడు ఎల్ఆర్ కృష్ణబాబుకు జానపద కళారత్న ఉగాది పురస్కారం, సంగీత ఉపాధ్యాయులు సోడెం విజయరాజ్‌కుమార్‌కు సంగీత సాఫల్య, కళారత్న ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వీరిని పలువురు ప్రముఖులు అభినందించారు.

జీతాలు చెల్లించాలని కార్మికుల ధర్నా

చింతలపూడి : మండలంలోని వెలగలపల్లి (కేఎమ్ ఆర్ సీడ్స్) మొక్కజొన్న ఫ్యాక్టరీ యాజమాన్యం మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని కార్మికులు బుధవారం ఆందోళన జరిపారు. ఫ్యాక్టరీ గేటు ముందు ధర్నా చేసి జీతాలు మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వీఎస్ నారాయణ, మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పండగ పూట ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులను పస్తులు ఉంచడం శోచనీయమని అన్నారు. ఇటీవల ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ఒక కార్మికురాలు మృతి చెందిన ఘటన చోటు చేసుకుందని తెలిపారు. మహిళా కార్మికులకు టాయిలెట్లు కూడా లేవని చెప్పారు. కార్మికుల సమస్యలు పరిష్కరించి జీతాలు చెల్లించకపోతే కార్మికుల తరుపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కోడిపందేలు, పేకాట స్థావరాలపై దాడులు

ద్వారకాతిరుమల : మండలంలో కోడిపందేలు, పేకాట స్థావరాలపై బుధవారం పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడిపందేలు వేస్తున్న 18 మందిని, పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 19 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై టి.సుధీర్ కథనం ప్రకారం. మండలంలోని గుండుగొలనుకుంట గ్రామంలో కోడిపందేలు వేస్తున్న 5 గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 2,600 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులను, అలాగే కోడిగూడెం గ్రామంలో 6 గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 1,100 నగదు, ఒక కోడి పుంజు, రెండు కోడి కత్తులను, రాళ్లకుంట గ్రామంలో 5 గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 5,900 నగదు, రెండు కోడి పుంజులను, సత్తాల గ్రామంలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 600 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వెంకటకృష్ణాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 8,800 నగదు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటిపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పీటర్ కురమాకు మదర్ థెరిస్సా అవార్డు



పీటర్ కురమాకు అవార్డు ఇచ్చి సన్మానిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : స్థానిక షాలెం ఎవాంజలికల్ చర్చ్, మినిస్ట్రీస్ ఫౌండర్, డైరెక్టర్ పీటర్ కురమాకు మదర్ థెరిస్సా అవార్డు లభించింది. చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలామ్, మదర్ థెరిస్సా, విలియం కేరీ అవార్డు బహుకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ఫౌండర్ డాక్టర్ వైఎస్ చిన్నారావు చేతుల మీదుగా మదర్ థెరిస్సా అవార్డు, సన్మాన పత్రాన్ని బహుకరించినట్లు పీటర్ కురమా తెలిపారు. అలాగే బిషప్ డాక్టర్ సుధాకర్, అడ్వకేట్ హైకోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వెంకటశివ కుమార్ పూలమాలలు, శాలువాలతో సన్మానించినట్లు తెలిపారు.

గ్రామాల్లో కోడిపందేలపై దాడి

జంగారెడ్డిగూడెం : మండలంలోని కేతవరం, శ్రీనివాసపురం గ్రామాల్లో కోడిపందేల స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. శ్రీనివాసపురంలో నిర్వహించిన దాడుల్లో ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.600, ఒక కోడి, కోడికత్తి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే కేతవరంలో నిర్వహించిన దాడిలో ముగ్గురిని అరెస్టు చేసి రూ. 800 నగదు, ఒక కోడి, కోడికత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోలవరం రూరల్ : కోడిపందేలపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఇటుకలకోట గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసి రూ.2260 నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ చెప్పారు.

అల్లాహ్ దయకు పాత్రులు కావాలి



ముస్లింలకు జావ సరుకులు అందజేస్తున్న మేయర్ నూర్జహాన్ దంపతులు

ఏలూరు టౌన్: రంజాన్ మాసంలో ముస్లింలంతా భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తూ అల్లాహ్ దయకు పాత్రులు కావాలని ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ నూర్జహాన్ సూచించారు. బుధవారం స్థానిక పవర్‌పేటలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని సుమారు 20 మసీదులకు రంజాన్ పండుగ నెలరోజులకు సరిపడా సుమారు రూ.5 లక్షల విలువైన జావ సరుకులు బొంబాయి రవ్వ, ఆయిలు, పెసర పప్పు మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు చేతుల మీదుగా మసీదు పెద్దలకు అందజేశారు. అంజుమన్ కమిటీ పెద్దల విజ్ఞప్తి మేరకు గత ఏడేళ్లగా ఏలూరు నగరం, చుట్టు పక్కల ఉన్న సుమారు 20 మసీదులకు జావ సరుకులను ఎస్ఎంఆర్ పెదబాబు సహకారంతో అందిన్నట్టు మేయర్ నూర్జహాన్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తోన్న పథకాలను ఏలూరులోని ప్రతి ముస్లింకీ సక్రమంగా అందేలా ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలిచ్చారని. వీటి అన్నిటిని ముస్లింలు ఉపయోగించుకోవాలని మేయర్ నూర్జహాన్ పెదబాబు కోరారు. పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ పెదబాబు ముస్లింలకు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంజుమన్ ప్రెసిడెంట్ సులేమాన్, సెక్రటరీ అమీర్ జాని, కార్పొరేటర్ ఇలియాస్ పాషా, రాజా అహ్మద్, ఇక్బాల్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ పరిధి లో ఆస్తి పన్ను చెల్లింపులపై ప్రభుత్వం కల్పిస్తున్న వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్-1 టి.అరుణ ప్రజలకు సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ఆదేశాలతో బుధవారం సెలవు రోజు కావటంతో రెవెన్యూ సిబ్బంది నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీర్ఘకాలికంగా పన్నులు చెల్లించని వారి ఇళ్లకు నీటి కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఆఫీసర్ అరుణ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పన్నులు చెల్లించకపోవటంతో వడ్డీ అధికంగా పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను చెల్లింపులపై వడ్డీ రాయితీ ఇవ్వటంతో ప్రజలకు ఎంతో ఊరట ఇస్తుందని అన్నారు. ఈనెల 31తేదీ లోపు పన్ను బకాయిలు మొత్తం చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలు ఆస్తి పన్ను బకాయిలు సకాలంలో చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సౌకర్యార్థం సెలవు రోజుల్లోనూ పన్నుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ డ్రైవ్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నంబూరి రవి, బిల్ కలెక్టర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.